క్లుప్తంగా

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

దహెగాం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో మార్చి 2023 నుంచి 31 మార్చి 2024 వరకు కొనసాగిన ఉపాధి పనులపై శనివారం మండల కేంద్రంలోని స్థానిక రైతువేదికలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో రాజేందర్ శుక్రవారం తెలిపారు. ఈజీఎస్ సిబ్బంది, కూలీలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటాం

ఆసిఫాబాద్అర్బన్: వాంకిడి మండలానికి చెందిన జర్నలిస్టు సురేశ్ మృతి తీరనిలోటు అని ఆయన కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని టీయూడబ్ల్యూజే సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. శుక్రవారం ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న సురేశ్ పార్థివదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియలకు జర్నలిస్టుల నుంచి సేకరించిన రూ. 10వేలు ఆయన భార్యకు అందజేశారు. ప్రకాష్‌గౌడ్, రాజ్‌కుమార్, సాయి, సంతోష్, ఖలీల్, తారు, రమేశ్, శ్రీనివాస్ రావ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని గుంటూరుకాలనీ, సర్‌సిల్క్‌కాలనీ, పెట్రోల్‌పంపు ఏరియాలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పేకాట శిబిరంపై దాడి

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో కౌటాల సీఐ ముత్యం రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ప్రభాకర్, చంద్రమౌళి, శ్రీకాంత్, శంకర్ గౌడ్, భాస్కర్‌లను పట్టుకొని, వారి వద్ద నుంచి రూ.9140 నగదు, రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు


అరెస్టు చూపుతున్న ఎస్సై మధుకర్

కౌటాల: మండలంలోని గుండాయిపేటలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గుండాయిపేట గ్రామంలోని అతుల్ ఆన్‌లైన్ షాపులో సెప్టెంబర్ 9న రూ.85వేల నగదు చోరీకి గురైంది. బాధితుడు తోరే అతుల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అదే గ్రామానికి చెందిన చుందిన నాగపురి గణేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడని ఎస్సై తెలిపారు. అతడి వద్ద నుంచి నగదు రికవరీ చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ఇంద్రవెల్లి: మహిళపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కాత్లే భీంరావ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కారుడ్రైవర్ ఇమ్రాన్ భీంనగర్ గ్రామానికి చెందిన చాటే లక్ష్మి వద్ద నుంచి గత నాలుగేళ్ల క్రితం రూ.6 లక్షల అప్పు తీసుకున్నాడు. విడతలవారీగా చెల్లించాలని లక్ష్మి అడిగినా ఇవ్వడం లేదు. దీంతో రెండుసార్లు గ్రామపెద్దలు, కులపెద్దలతో పంచాయితీ పెట్టింది. పెద్దల సమక్షంలో ఇమ్రాన్ ఇస్తానని ఒప్పుకొని ఆరు నెలలైన ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వాలని అడిగితే చంపేస్తానని బెదిరించాడు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో లక్ష్మి గొంతుపిసికి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: మంత్రి కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

జోరుగా ఇసుక దందా

- వాగుల నుంచి అనుమతులు లేకుండా తరలింపు
- పట్టించుకోని అధికారులు
- అందినకాడికి దండుకుంటున్న అక్రమార్కులు


ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న కూలీలు (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని ప్రజాప్రతినిధుల అండదండలతో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. వర్షాకాలంలో కురిసిన వర్షాలకు అన్ని వాగులకు భారీగా వరదలు వచ్చాయి. దీంతో ఇసుకకు కొరత ఏర్పడి డిమాండ్ పెరిగింది. ఈ అవకాశాన్ని అనుగుణంగా మలుచుకొని కొంతమంది ఇసుక అక్రమార్కులు పగటిపూట రహస్య ప్రాంతంలో డంప్ చేసి, రాత్రి తరలిస్తున్నారు. వాగుల్లో ఇసుక లోతుగా తవ్వడంతో వాగులు ప్రమాదకరంగా మారాయి. కానీ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నా.. అధికారులు పట్టుకోకపోవడంతో ట్రాక్టర్ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

అనుమతులు లేకుండానే..

అనుమతులు లేకపోయినా జిల్లా కేంద్రంతో పాటు మండలం పరిధిలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు, ఇటుకల తయారీ, పైపులు, కుండీలు, పోల్స్ పరిశ్రమలకు ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి పగలు అనే తేడా లేకుండా పెద్దవాగు, చిలాటిగూడ, గుండి, చిర్రకుంట, కొత్త రాహపల్లి, చోర్‌పల్లి వాగుల నుంచి నిత్యం వందల ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా.. పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ట్రాక్టర్ ఇసుకకు దూరంను బట్టి రూ.1500 నుంచి రూ. 2500 వేలకు విక్రయిస్తున్నారు. కొంత మంది ప్రభుత్వ కార్యాలయాలకు అని చెప్పి ఇసుక అక్రమణ చేస్తున్నారు.

ఆయా వాగుల నుంచి..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగుల్లో ఇసుక భారీ స్థాయిలో ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మండలాల్లో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వర్షాకాలంలో నెలకొన్న ఇసుక కొరతను అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఆసిఫాబాద్ మండల పరిధిలో గుండి, గుడెన్ ఘట్, చిలాటిగూడ, జిల్లా కేంద్రంలో పెద్దవాగు, చోర్‌పల్లి, రెబ్బెన మండలంలో గంగపూర్, కాగజ్‌నగర్ మండలంలో రాస్‌పెల్లి వాగుల్లో ఇసుక దందా జోరుగా సాగుతోంది. పగటి పూట అనువైన స్థలంలో డంపింగ్ చేసి, రాత్రి ఆదిలాబాద్, ఉట్నూర్, మహారాష్ట్రతో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బతుకమ్మ సంబురాలు


బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మ పేర్చి ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ అన్ని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాయలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు, ఎంపీడీవో అల్బర్ట్, డీటీ సరిత, ఐసీడీఎస్ సిర్పూర్(టి) సీడీపీవో విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు పద్మ, హసీనా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


జిల్లా కేంద్రంలోని బాపూనగర్‌లో పూజలు

ఆసిఫాబాద్: శరన్నవరాత్రి వేడుకలు జిల్లా కేంద్రంలో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. వివిధ ఆలయాలు, మంటపాల వద్ద ప్రతిష్ఠించిన దుర్గామాత, శారదా మాత విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కేశవనాథ ఆలయం, శారదా మండలి వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. వాసవీ మందిరం, గాంధీచౌక్‌లోని దుర్గామాత వద్ద అర్చకులు ముదిగొండ రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. మంటపాలు మహిళలు, భక్తులతో సందడిగా మారాయి.

నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న ఎస్సై మధుకర్


మాట్లాడుతున్న ఎస్సై కొమురయ్య

పెంచికల్‌పేట్: శరన్నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దుర్గామాత మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నవరాత్రులు ప్రశాంతంగా జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. వివాదాలకు తావు లేకుండా వ్యవహరించాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కౌటాల: దేవి శరన్నవరాత్రులు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై మధుకర్ అన్నారు. శుక్రవారం వివిధ గ్రామాల మండపాల కమిటీ సభ్యులతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. మండపాల వద్ద మత్తు పదార్థాలు వాడకూడదని, మద్యం సేవించి మండపాల రాకుండా చూసుకోవాలన్నారు. తొమ్మిది రోజుల పాటు నవ రాత్రులు శాంతియుతంగా జరుపుకునేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఆదిలాబాద్‌టౌన్: అనాథ మృతదేహానికి బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. గత మూడు రోజుల క్రితం ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కేలో భిక్షాటన చేస్తూ అశోక్ సట్వాజి(30) మృతిచెందాడు. దీంతో పోలీసులు మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్ మార్చురీలో భద్రపర్చారు. ఈ విషయాన్ని మహారాష్ట్రలోని జాగిర్ గ్రామంలో నివాసం ఉంటున్న మృతుడి మేనమామ జగన్నాథ్ సట్వాజికు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన శుక్రవారం ఆదిలాబాద్‌కు చేరుకున్నారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు తన వద్ద డబ్బులు లేకపోవడంతో వెల్ఫేర్ సొసైటీ సభ్యులను ఆశ్రయించాడు. ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టలవాడ శ్మశానవాటికలో సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు అజీజ్, సభ్యులు పాల్గొన్నారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రారంభం

సిరికొండ: మండలంలో ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ప్లాట్లను అధికారులు క్రమబద్ధీకరిస్తున్నారు. శుక్రవారం నుంచి ప్లాట్లను క్రమబద్ధీకరిస్తున్నారు. ఈకార్యక్రమాన్ని తహసీల్దార్ తుకారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న దరఖాస్తుదారులందరూ క్రమబద్ధీకరణ చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు ప్రతీ విషయం వివరించాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విలాస్, పంచాయతీ కార్యదర్శులు అరుణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం బిందెలతో నిరసన


బిందెలతో నిరసన తెలుపుతున్న ప్రజలు

దహెగాం: గత కొన్ని రోజులుగా తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఖాళీ బిందెలతో శుక్రవారం నిరసన తెలిపారు. మండలంలోని బీబ్రా గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ పైప్‌లైన్ సక్రమంగా లేక పోవడంతో తాగునీరు సరఫరా కావడం లేదని వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాగునీటి కోసం కాలనీలో ఉన్న చేతిపంపు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులు తీర్చాలని గ్రామస్తులు కోరారు. ఈ విషయమై ఎంపీడీవో రాజేందర్‌ను వివరణ కోరగా ఎస్సీ కాలనీవాసులకు తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ధర్నా విజయవంతం చేయండి


మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఇంద్రవెల్లి: ఐటీడీఏ అధికారాలను కలెక్టర్‌కు అప్పగించాలనే తీర్మానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీలకు సంబంధించిన ఏ సమస్య అయినా ఐటీడీఏ పరిధిలోనే పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈనెల 7న ఐటీడీఏ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసమే ఐటీడీఏ ఏర్పాటు చేశారన్నారు. ఐటీడీఏ పరిధిలో ఐఏఎస్ అధికారి ద్వారానే ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు ఉమ్మడి జిల్లా ఆదివాసీలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి సోయం రాందాస్, జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భారత్, తొమ్మిది ఆదివాసీ తెగల సమన్వయ కమిటీ కార్యదర్శి కొట్నాక్ బారిక్‌రావ్, పుర్క చిత్రు, సోయం వినోద్, సోయం మురారీ పాల్గొన్నారు.

- ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములు
- సరిహద్దులు పరిశీలించిన రెవెన్యూ అధికారులు
- అక్రమార్కులపై చర్యలకు వెనకంజ

వచ్చారు.. చూశారు..!


హద్దులు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

బెజ్జూర్: మండలంలోని విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని గత కొద్ది రోజుల క్రితం 'సాక్షి'లో కథనంగా ప్రచురించింది. దీంతో రెవెన్యూ అధికారులు సంబంధిత సర్వేయర్‌ను పంపి హద్దులు పరిశీలన చేసి చేతులు దులుపుకున్నారని మండలవాసులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను వెలికితీసి తమ ఆధీనంలోకి తీసుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బెజ్జూర్ మండలంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న ప్రభుత్వ భూములకు వెంచర్లుగా వేసి విక్రయిస్తున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

వారసంత భూమి ఉన్నట్లా? లేనట్లా?

బెజ్జూర్ మండల కేంద్రంలో కొన్నేళ్ల క్రితం వదిలి పెట్టిన ప్రభుత్వ భూమి ఉన్నట్లా? లేనట్లా అనే అనుమానాలు కలుగుతున్నాయి. బస్టాండ్ నిర్మాణం కోసం 40 సెంట్లు, మంగళి షాపుల కోసం 10 సెంట్లు, వారసంత నిర్వహణ కోసం 30 సెంట్లు, కిరాణా షాపుల కోసం 10 సెంట్లు, అటవీశాఖ భవనం కోసం 30 సెంట్ల భూమి, 237 సర్వే నెంబర్లు 1 ఎకరం 20 గుంటల భూమితో పాటు మరో సర్వే నెంబర్లు బట్టల షాపుల కోసం సైతం ప్రభుత్వం భూమిని కేటాయించారు. అయితే ఆ భూములు అంగబలం, ఆర్థిక, రాజకీయం పలుకుబడి ఉన్న వ్యక్తులు ఆక్రమించుకొని భవనాలు కడుతున్నారు. అయినా.. సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఆక్రమణకు గురైన భూములు సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు నామమాత్రంగా పరిశీలించి పత్తా లేకుండా పోయారని ప్రజలు విమర్శిస్తున్నారు.

అనుమతులు లేకుండా కట్టడాలు..

మండల కేంద్రంతో పాటు ప్రధాన రహదారుల వెంబడి ఉన్న ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు వెలుస్తున్నప్పటికీ అధికారులు, గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ భూములు అసలు క్రయ విక్రయాలు నిర్వహించకూడదనే నిబంధన ఉన్నా.. కొందరు నిబంధనాలను తుంగలో తొక్కి వెంచర్లుగా ఏర్పాటు చేసి అమ్ముతున్నారు. ఈవిషయంపై బెజ్జూర్ తహసీల్దార్ భూమేశ్వర్‌ను సాక్షి వివరణ కోరగా.. సరైన మ్యాప్‌లు అందుబాటులో లేక కొంత ఆలస్యం అవుతుంది. సర్వే పూర్తి చేసి హద్దులు గుర్తిస్తామని తెలిపారు.

జనరల్ మజ్దూర్ పోస్టులు స్థానికులకే ఇవ్వాలి


జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులను స్థానికులకే ఇవ్వాలని స్థానిక ఉద్యోగులు కోరారు. శుక్రవారం గోలేటిటౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో పరిధిలోని తిర్యాణి, రెబ్బెన, ఆసిఫాబాద్ మండలాలకు చెందిన తమ తల్లిదండ్రులు గోలేటి 1, గోలేటి 1ఏతో పాటు ఇతర డిపార్టుమెంట్లలో పనిచేసి ఎన్నో ఏళ్లుగా ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారన్నారు. ఏరియాలో గనులు మూతపడటంతో సర్వీసు చివరి సమయంలో ఇతర ఏరియాకు బదిలీపై వెళ్లగా వారిలో కొంత మంది మెడికల్ అన్‌ఫిట్ కావడంతో వారి వారసులకు యాజమాన్యం కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించిందన్నారు. దీంతో కన్న తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ ఇతర ఏరియాలో విధులు నిర్వహిస్తున్నామని వాపోయారు. ఏరియాలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌లో స్థానికులు మొదటి ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్: ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్కాపూర్, చిన్నమల్కాపూర్, కొత్వాల్‌గూడలో పర్యటించారు. మారుమూల ఆదివాసీ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానన్నారు. ఏ సమస్య వచ్చిన నేరుగా తనను సంప్రదించాలన్నారు. పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, ప్రీతంరెడ్డి, జ్ఞాను కేంద్రే, సంగ ఆశన్న యాదవ్, పవార్ రవీందర్, మాధవ్ కేంద్రే, సంతోష్ గౌడ్, భీంరావ్, రాందాస్ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాలతో ఆధ్యాత్మికం

నేరడిగొండ: గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలతో ఆధ్యాత్మికం పెంపొందుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని కుంటాల గ్రామంలో శ్రీజగదాంబ దేవి, సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ గుడి నిర్మాణానికి రూ.43 లక్షలతో శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ బంజారా సంప్రదాయ పూజలు చేశారు. ప్రతిఒక్కరూ భక్తిభావనను అలవర్చుకోవాలని, దీంతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. చిన్న బుగ్గరాం గ్రామంలోని శ్రీజగదాంబ దేవి, సేవాలాల్ మహరాజ్ ఆలయం వద్ద నూతన మండపం నిర్మాణానికి రూ.12 లక్షలతో భూమిపూజ చేశారు.

కల్వర్టులకు మరమ్మతులు చేయండి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బావోజిపేట్‌లో కల్వర్టు, సీసీరోడ్డు పనులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులు చేయడంతో కల్వర్టులు కూలిపోయాయని గ్రామస్తులు అన్నారు. శుక్రవారం మాజీ సర్పంచ్ టేకం లక్ష్మీదేవ్‌రావులకు వినతి పత్రం అందచేశారు. గత ఏడాది మూడు కల్వ ర్టులు, సీసీరోడ్డు నిర్మాణం కోసం రూ. 17 లక్షలు ఎంపీ నిధులు మంజూరైనట్లు తెలిపారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కల్వ ర్టులకు మరమ్మతులు చేయాలని కోరారు.